






'లోక్‌సభ'కు

మోగిన పార్లమెంట్ ఎన్నికల నగారా

- షెడ్యూల్ ప్రకటించిన కేంద్ర ఎన్నికల సంఘం
- ఉమ్మడి జిల్లాలో వరంగల్, మహబూబాబాద్ స్థానాలు
- గెలుపే ధ్యేయంగా ప్రచార పర్వంలోకి ప్రధాన పార్టీలు

(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పార్లమెంట్ ఎన్నికలకు ఎన్నికల నగారా మోగింది. ఈ మేరకు శనివారం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడంతో రాజకీయపార్టీలు లోక్‌సభ సమరానికి సై అంటున్నాయి. దేశవ్యాప్తంగా ఏడు దశల్లో ఎన్నికలు జరగనుండగా.. నాలుగో దశలో మే 13న రాష్ట్రంలోని అన్నిపార్లమెంట్ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాలకు కూడా ఎన్నికలు నిర్వహించేందుకు చేయాల్సిన ఏర్పాట్లపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టింది. ఇప్పటికే ఓటరు జాబితాలను సిద్ధం చేయగా.. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులకు, అభ్యర్థుల సమగ్ర వివరాల కోసం ఎన్నికల సంఘం ప్రత్యేక యాప్‌లను కూడా విడుదల చేసింది. మరోవైపు షెడ్యూల్ ప్రకటనతోనే శనివారం నుంచి అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసే దిశగా అధికారులు దృష్టి సారిస్తున్నారు. ఇక పార్లమెంట్ ఎన్నికలపై గంపెడాశలు పెట్టుకున్న ప్రధాన పార్టీలు, అభ్యర్థులు ప్రజాక్షేత్రంలోకి వెళ్లేందుకు వ్యూహరచన చేసుకుంటున్నారు. శనివారం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రభుత్వ పథకాల అమలుకు, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు బ్రేక్ పడింది. కోడ్ ముగిసే వరకు అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ఉండదు.

విస్తృత ఏర్పాట్లలో అధికార యంత్రాంగం

ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక కీలకమైన ప్రాంతాలు, జిల్లాల సరిహద్దుల్లో పోలీసులు తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. రూ.50వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లితే, దానికి సంబంధించిన ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. ఇక వరంగల్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 1,893 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా.. అత్యధికంగా పాలకుర్తి నియోజకవర్గంలో 294 కేంద్రాలు, స్టేషన్‌ఘనపూర్ పరిధిలో 290 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో 1,783 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయగా ములుగులో అత్యధికంగా 209, మహబూబాబాద్‌లో 184 పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించనున్నారు. దివ్యాంగులు, గర్భిణులు సులువుగా పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా, ఓటరు ఫెలిసిటేషన్ సెంటర్, హెల్ప్ డెస్క్, సిగ్నేజ్, షెడ్, తగిన వెలుగు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే అభ్యర్థికి సంబంధించిన మొత్తం సమాచారాన్ని తెలుసుకునేందుకు వీలుగా 'నో యువర్ క్యాండిడేట్..' యాప్ ద్వారా తెలుసుకునే అవకాశం కల్పించారు. అలాగే ఎన్నికల్లో జరిగే అవకతవకలపై సీ విజిల్ యాప్ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయవచ్చు.

ఎన్నికల ప్రక్రియ కొనసాగనుందిలా..

కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 18న గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. అదే రోజు నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 26వ తేదీన నామినేషన్ల పరిశీలన, 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. మే 13వ తేదీన రాష్ట్రంలోని అన్ని స్థానాలతో పాటు వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలకు పోలింగ్ జరుగుతుంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఇక వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి వరంగల్ కలెక్టర్, మహబూబాబాద్ స్థానానికి మహబూబాబాద్ కలెక్టర్ ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తారు. అభ్యర్థుల నామినేషన్లను కలెక్టరేట్లలోనే స్వీకరించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

'మానుకోట'లో పొలిటికల్ హీట్

మహబూబాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ఎన్నికలకు నగారా మోగడంతో మహబూబాబాద్ (మానుకోట) పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పొలిటికల్ హీట్ మొదలైంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇప్పటికే ఖరారవడంతో వారు ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. తమ అనుచరగణాన్ని కూడగట్టుకుని.. ప్రచార పర్వంలోకి దిగేతందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం.. మే 13న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నాటికి దాదాపు 57 రోజుల వ్యవధి ఉండగా.. ఈ సమయాన్ని సక్రమంగా వినియోగించుకుని తమ సత్తా చాటాలని అభ్యర్థులు వ్యూహరచన చేసుకుంటున్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం..

మిగతా 7వ పేజీలో..

వరంగల్ అభ్యర్థులను తేల్చని కాంగ్రెస్, బీజేపీ

లోక్‌సభ ఎన్నికల నగారా మోగడంతో ఉమ్మడిజిల్లాలో రాజకీయం వేడెక్కుతోంది. ఇప్పటికే మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ తమ అభ్యర్థులను ఖరారు చేయడంతో వారు ప్రజాక్షేత్రంలోకి దిగారు. ఇక వరంగల్ లోక్‌సభ స్థానానికి బీఆర్ఎస్ తన అభ్యర్థిగా కడియం కావ్య పేరును ప్రకటించగా.. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులెవరే ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ క్రమంలో ఆయా పార్టీల కేడర్ అయోమయానికి గురవుతోంది. మే 13న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో అభ్యర్థుల ప్రకటన విషయంలో కాంగ్రెస్, బీజేపీ మరికొంత సమయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. అయితే బీజేపీలోకి మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను ఆదివారం చేర్చుకుని, అభ్యర్థిగా ప్రకటిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఇక కాంగ్రెస్‌లోనే 50మందికి పైగా ఆశావాహులు ఉండటంతో వారిలో ఎవరిని ఎంపిక చేస్తారనే ఉత్కంఠ ఆ పార్టీ కేడర్‌లో కనిపిస్తోంది.



వరంగల్‌లో 18,16,429మంది, మానుకోటలో 15,26,998 ఓటర్లు

వరంగల్ లోక్‌సభ పరిధిలో 7 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. గత నెల 8వ తేదీ వరకు నమోదైన మొత్తం ఓటర్లు 18,16,429మంది. వీరిలో మహిళలు 9,23,510మంది కాగా, పురుషులు 8,92,527 మంది ఉన్నారు. 392 మంది ఇతరులు ఉన్నారు. వరంగల్ ఎంపీ స్థానంలో పురుషుల కంటే మహిళలు 30,983 మంది అధికంగా ఉన్నారు. అలాగే మహబూబాబాద్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో మొత్తం 15,26,998 మంది ఓటర్లుండగా వీరిలో మహిళలు 7,81,339 మంది, పురుషులు 7,45,554 మంది, 105 మంది ఇతరులున్నారు. ఇక్కడ కూడా మహిళ ఓటర్లు 35,785 మంది అధికంగా ఉన్నారు. కాగా, వరంగల్ పార్లమెంట్ పరిధిలో 2019కంటే ఓటర్లు భారీగా పెరిగారు. 2019లో 15,78,335మంది ఉంటే ఈసారి 18,16,429మంది ఉన్నారు. ఈ ఐదేళ్లలో 2,38,094 మంది ఓటర్లు పెరిగారు. అలాగే మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలో 2019లో 13,36,286 మంది ఉంటే ఈసారి 15,26,998 ఓటర్లున్నారు. గత ఐదేళ్లలో 1,90,712మంది పెరిగారు. తుదిజాబితా నాటి ఈ సంఖ్య ఇంకా పెరుగుతుందని అంచనా.

వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధి ఓట్లు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
స్టేషన్‌ఘనపూర్	1,24,659	1,27,948	01	2,52,608
పాలకుర్తి	1,26,256	1,28,533	13	2,54,802
పరకాల	1,08,156	1,14,105	02	2,22,263
వరంగల్ పశ్చిమ	1,38,594	1,43,095	14	2,81,703
వరంగల్ తూర్పు	1,24,707	1,31,428	339	2,56,474
వర్ధన్నపేట	1,33,524	1,38,514	17	2,72,055
భూపాలపల్లి	1,36,631	1,39,887	06	2,76,524
మొత్తం	8,92,527	9,23,510	392	18,16,429

మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధి ఓట్లు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
డోర్నకల్	1,08,931	1,13,165	07	2,22,103
మహబూబాబాద్	1,26,290	1,31,449	47	2,57,786
నర్సంపేట	1,14,891	1,20,104	09	2,35,004
ములుగు	1,13,413	1,18,935	26	2,32,374
పినపాక	99,608	1,03,525	05	2,03,138
ఇల్లందు	1,09,632	1,14,818	04	2,24,454
భద్రాచలం	72,789	79,343	07	1,52,139
మొత్తం	7,45,554	7,81,339	105	15,26,998

ఐదేళ్లలో పెరిగిన ఓటర్లు..

పార్లమెంట్ స్థానం	2019	2024	పెరిగిన ఓట్లు
వరంగల్	15,78,335	18,16,429	2,38,094
మహబూబాబాద్	13,36,286	15,26,998	1,90,712

ఐదుగురి రిమాండ్

గోవిందరావుపేట, మార్చి 16: మండలంలోని దుంపెల్లిగూడెం గ్రామానికి చెందిన రైతు పిండి రమేష్ కరెంటు తీగలకు తాకి మృతిచెందిన సంఘటనలో ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పస్రా సీఐ శంకర్ తెలిపారు. గతనెల 12న దుంపెల్లిగూడెం గ్రామానికి చెందిన ఎర్రబోయిన అశోక్, పన్నాల శ్రీనివాసరెడ్డి, నద్దునూరి కోటయ్య, నద్దునూరి సందీప్, అజ్మీరా స్వామి వన్యప్రాణులను వేటాడేందుకు కరెంటు తీగలు అమర్చారని అన్నారు. తీగలను గమనించని అదే గ్రామానికి చెందిన పిండి రమేష్ వాటికి తగిలి విద్యుదాఘాతంతో మృతిచెందాడని తెలిపారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని, నిందితులను అదుపులోకి తీసుకుని శనివారం ములుగు జిల్లా కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామని సీఐ వివరించారు. గ్రామాల్లో ఎవరైనా పంట పొలాల్లో గానీ, అడవుల సమీపంలో గానీ కరెంటు తీగలు అమర్చితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిరుద్యోగ మైనారిటీలకు ఉచిత శిక్షణ

ములుగు కలెక్టరేట్, మార్చి 16: తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్ నిర్వహించే యూపీఎస్సీ సీఎస్‌ఏటీ ఉచిత శిక్షణను జిల్లాలోని మైనారిటీ నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని మైనారిటీ శాఖ జిల్లా అధికారి ప్రేమలత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళా అభ్యర్థులకు 33.33 శాతం, అన్ని కేటగిరీల్లో వికలాంగులకు ఐదు శాతం సీట్లు రిజర్వేషన్ కల్పింపించినట్లు తెలిపారు. ఈశిక్షణకు ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన మైనారిటీ అభ్యర్థులు ఏప్రిల్ 12లోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎంఆర్ఈఐఎస్‌తెలంగాణ.సీజీజీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మహిళా సాధికారతకు సహకారం

- స్వావలంబనే ధ్యేయంగా సర్కారు కృషి
- సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



ములుగులో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, మార్చి 16: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది సాధికారత దిశగా ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ములుగు నియోజకవర్గంలో ఆమె శనివారం పర్యటించారు. కలెక్టరేట్‌లో శనివారం ములుగు, గోవిందరావుపేట, వెంకటాపూర్(రామప్ప) మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను, పంచాయతీ సెక్రటరీలకు తాగునీటి పరీక్ష పరికరాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా స్వావలంబనే ధ్యేయంగా ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని అన్నారు. ప్రభుత్వం అందించే అవకాశాలను ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇప్పటికే మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10లక్షలకు పెంచామని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని అన్నారు. పెండింగ్‌లో ఉన్న కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందించామని పేర్కొన్నారు. మహిళలను అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమన్నారు. వేసవిలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు , సిబ్బంది ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, గ్రామపంచాయతీ పరిధిలోని ఓహెచ్ఎస్ఆర్‌లలో నీటిని పరీక్షించి విడుదల చేయాలన్నారు. అనంతరం ములుగు మండలంలోని కాసిందేవిపేట గ్రామంలో రూ.5లక్షల నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ప్రారంభించి యాదవ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జగ్గన్నపేట గ్రామంలో రూ.10లక్షల నిధులతో పుట్టమల్లన్న ఆలయ ప్రహరీగోడ, సీసీరోడ్డు నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రూ.10లక్షల నిధులతో ప్రాథమిక పాఠశాల ప్రహరీగోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చిన్నగుంటూరుపల్లిలో రూ.5లక్షల నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. వెంకటాపూర్(రామప్ప) మండలంలోని లక్ష్మీదేవిపేట- బూర్గుపేట గ్రామాల మధ్యలోని బొదరవాగుపై రూ.కోటి15 లక్షలతో చేపట్టనున్న హైలెవల్ వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని వికలాంగులకు కృత్రిమ కాళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, సి.హెచ్.మహేందర్‌జీ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లేశం, ఎంపీపీ గండ్రకోట శ్రీదేవి, ప్రజాప్రతినిధులు, వివిధశాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సరైన పోషణతోనే ఆరోగ్య తెలంగాణ

సరైన పోషణతోనే ఆరోగ్య తెలంగాణగా ఆవిర్భవిస్తుందని మంత్రి సీతక్క అన్నారు. ములుగులోని డీఎల్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పోషణ అభియాన్ కార్యక్రమం జరగ్గా ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆరునెలలు పూర్తయిన చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందే సేవలను గర్భిణులు, బాలింతలు, పిల్లలు వినియోగించుకుని పోషణలోపం లేకుండా ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకుంటూ రక్తహీనత లేకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జె.ఎం.స్వర్ణలత లెనిన, జిల్లా మైనారిటీ శాఖ అధికారి ఈపీ.ప్రేమలత, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు కె.స్వాతి, భాగ్యలక్ష్మీ, సరస్వతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు

ఎమ్మెల్సీ కవిత అరెస్టు పట్ల నిరసన



ములుగులో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), మార్చి 16: లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కల్వకుంట కవితను అరెస్టు చేయడంపై బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. భూపాలపల్లిలోని అంబేద్కర్ కూడలిలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి నేతృత్వంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు బైఠాయించి రాస్తారోకో చేశారు. అక్కడికి చేరుకున్న భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్, ఎస్సై శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ బీఆర్ఎస్ శ్రేణులను అదుపులోకి తీసుకున్నారు. గండ్ర వెంకటరమణారెడ్డి సహా పలువురిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ నిరంకుశపాలన కొనసాగుతోందని వెంకటరమణారెడ్డి మండిపడ్డారు. ఈడీ, సీబీఐ లాంటి స్వతంత్ర సంస్థలు ప్రధాని మోదీ కనుసన్నల్లో నడుస్తున్నాయని విమర్శించారు. ప్రధాని ఎవరిని సూచిస్తే వారి జైలుకు పంపడం పరిపాటిగా మారిందని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణి, జడ్పీ వైస్ చైర్ పర్సన్ కళ్లెపు శోభ, ఎంపీపీ మందల లావణ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కళ్లెపు రఘుపతిరావు, సెగ్గం సిద్దు, బుర్ర రమేష్, బీఆర్ఎస్ రూరల్ అధ్యక్షుడు పిన్‌రెడ్డి రాజిరెడ్డి, జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీశ్‌రెడ్డి, పోల్సాని లక్ష్మీనరసింహారావు, పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, మోతె రాజు, పార్టీ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు మాదాసు తిరుపతమ్మ, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



భూపాలపల్లిలో బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు

- చిట్యాల : మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ఆరెపల్లి మల్లయ్య

మిగతా 8వ పేజీలో...



రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	ఆదివారం	సా : 6.32 గం..
సహర్ :	సోమవారం	ఉ : 5.00 గం..

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు ప్రారంభం



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

మహదేవపూర్, మార్చి 16: మండలంలోని కాళేశ్వరం సమీపంలోని అంతర్రాష్ట్ర వంతెన వద్ద పోలీసులు చెక్‌పోస్టును శనివారం ప్రారంభించారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలుబడిన నేపథ్యంలో మహదేవపూర్ సీఐ రాజేశ్వర్‌రావు, కాళేశ్వరం ఎస్సై భవానీసేన్ ఆధ్వర్యంలో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. మహారాష్ట్ర నుంచి వస్తున్న ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు.

ప్రపంచానికి నూతన ఆవిష్కరణలు అందించాలి

ఎస్సార్ వర్సిటీ స్నాతకోత్సవంలో న్యాక్ చైర్మన్ అనిల్ సహస్ర బుద్ధే

హసన్‌పర్తి, మార్చి 16 : యువ ఇంజనీర్లు ప్రపంచానికి నూతన ఆవిష్కరణలను అందించాలని ఎగ్జిక్యూటివ్ కమిటీ నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ చైర్మన్ అనిల్ సహస్ర బుద్ధే అన్నారు. హసన్‌పర్తి మండలం అనంతసాగర్ వద్దగల ఎస్సార్ యూనివర్సిటీలో శనివారం ప్రథమ స్నాతకోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువ ఇంజనీర్లు సాంకేతిక పరిజ్ఞానంతో సమస్యలను పరిష్కరించే వారిగా ఉండి, నూతన ఆవిష్కరణలకు తోడ్పడాలన్నారు. యూనివర్సిటీ కల్పించే సదుపాయాలతో అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. కృత్రిమ మేధస్సు, మెషిన్ లర్నింగ్, డ్రోన్స్, రోబోటిక్స్, క్వాంటం కంప్యూటింగ్ సాంకేతికతతో ప్రపంచం ముందుకు వెళుతుందన్నారు. భారతదేశం సైన్స్ అండ్ టెక్నాలజీలో మార్గదర్శిగా నిలిచిందన్నారు. అందుకు నిదర్శనం చంద్రయాన్, ఆదిత్య మిషన్, థోరియం రియాక్టర్లు, వందేభారత్ రైళ్లు నిదర్శనమన్నారు. ఎన్‌ఈటీఎఫ్, పీఎంకేవీవై, ఎన్ఎ్‌సడీసీ, ఎన్ఎస్ఎం వంటివి ఏర్పాటు చేయడం ద్వారా సాంకేతిక నైపుణ్యాలు అందుతున్నాయని పేర్కొన్నారు. యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎనగందుల వరదారెడ్డి మాట్లాడుతూ.. 45ఏళ్లుగా విద్యారంగంలో సేవలందిస్తున్నట్లు తెలిపారు. 2002లో ఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలను స్థాపించి, ఎన్ఏఏసీ, ఎన్‌బీఏ, యూజీసీ అక్రిడియేషన్స్ పొంది, 2023లో జాతీయ స్థాయిలో 98వ స్థానం సాధించి, నూతన ఆవిష్కరణలతో జాతీయ స్థాయిలో అటల్ ర్యాంకింగ్‌లో ప్రథమ స్థానం పొందినట్లు పేర్కొన్నారు. సినీ గేయ రచయిత చంద్రబోస్ మాట్లాడుతూ.. ఆర్ఆర్ఆర్ చిత్రం ద్వారా ఆస్కార్ అవార్డు రావడం, ఎస్సార్ వర్సిటీ ద్వారా గౌరవ డాక్టరేట్ రావడం జీవితంలో మరిచిపోలేనివన్నారు. చదువు నేర్చుకున్న గురువుతోనే డాక్టరేట్ అందుకోవడం సంతోషదాయకమన్నారు. అనంతరం చంద్రబోస్‌కు గౌరవ డాక్టరేట్ పట్టాను, విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రో చాన్స్‌లర్ ఎనగందుల మధుకర్‌రెడ్డి, వైస్ చాన్స్‌లర్ దీపక్ గార్గ్, రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, కన్వొకేషన్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ సీవీగురురావు, డీన్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అనిల్ సహస్ర బుద్ధే

లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం

▶▶ తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాథే ▶▶ ఏసీబీ, హనుమకొండ రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల ప్రారంభం

వరంగల్ లీగల్, మార్చి 16 : లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం సాధ్యమవుతుందని, ఇందులో వరంగల్, హనుమకొండ జిల్లా కోర్టులు ముందున్నాయని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాథే ప్రశంసించారు. శనివారం వరంగల్, హనుమకొండ కోర్టుల సముదాయంలో కొత్తగా ఏర్పాటు చేసిన అవినీతి నిరో ధక వరంగల్ ప్రత్యేక కోర్టు (ఏసీబీ), హనుమకొండ రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఈ-సేవా కేంద్రం, రికార్డుల డిజిటలైజేషన్ కేంద్రాన్ని జస్టిస్ ఆలోక్ అరాథే ప్రారంభించారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శనివా రం జరిగిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా మొత్తం 3,43,182 కేసులు పరిష్కారంకాగా, వరంగల్ కోర్టు పరిధిలో 4713, హనుమకొండ జిల్లా కోర్టు పరిధిలో 3,501 కేసులు పరిష్కారమయ్యాన్నారు. లోక్‌అదాలత్ ద్వారా ఈ రెండు కోర్టుల పరిధిలో అత్యధికంగా కేసులు పరిష్కారం కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కేసుల సత్వర కృషి చేసినందుకు జ్యుడీషియల్ సిబ్బందిని ప్రధాన న్యాయమూర్తి అభినందించారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు కలిసికట్టుగా కృషి చేసినందు వల్లనే ఇది సాధ్యమైందన్నారు.



హనుమకొండ రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాథే

న్యాయవ్యవస్థ అంకితభావంతో అర్థవం తమైన పాత్రపోషించడం ద్వారానే సమాజంలో వెలుగులను నింపగలుగు తామని జస్టిస్ ఆలోక్ అరాథే అన్నారు. కేసుల పరిష్కారంలో న్యాయమూ ర్తులు, న్యాయవాదుల పరస్పర సహకారం కీలక మైందన్నారు. ఉభయులు పరస్పర సహకారం, సమన్వయంతోనే కేసులు సత్వరం పరిష్కారం అవుతా యన్నారు. వరంగల్ కోర్టు సముదాయంలో శనివారం ప్రారంభమైన ఈ-సేవా కేంద్రం ఎంతో ఉపయుక్తమైందని అన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద తెలంగాణ రాష్ట్రంలో మొదటి సారి దీనిని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. దీని కొనసాగిం పుగా ఈనెల 23న నల్లగొండ జిల్లాలో కూడా ఈ-సేవా కేంద్రం ఏర్పాటు చేయనున్నట్టు ఆయన తెలిపారు. ఈ-సేవా కేంద్రాన్ని న్యాయవాదులు సద్విని యోగం చేసుకోవడం ద్వారా కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ-సేవా కేంద్రం ద్వారా హైకోర్టు వరకు రావలసిన అవసరం లేకుండా ఇక్కడి నుంచే కేసులను దాఖలు చేయడంతో పాటు ఆన్‌లైన్‌లో వాదనలు వినిపించే అవకాశం ఉందన్నారు. కోర్టు ప్రాంగణంలో కొత్తగా అందుబాటులోకి తీసుకువచ్చిన డిజిటల్ కేంద్రం సౌకర్యాన్ని ప్రస్తావిస్తూ కేసులకు సంబంధించిన దస్తావేజులు కాలక్రమంలో దెబ్బతింటున్న దృష్ట్యా వాటిని శాశ్వతంగా భద్రపరిచేందుకు డిజిటైజేషన్ ఎంతో ఉపయోగపడుతుందని, ఈ సౌకర్యం వరంగల్ జిల్లా కోర్టు సముదాయంలో అందుబాటులోకి వచ్చినందుకు హర్షం వ్యక్తం చేశారు. దీనిని న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని జస్టిస్ అలోక్ అరాథే కోరారు. బార్ అసోసియేషన్ల ప్రతినిధులు తన దృష్టికి తెచ్చిన జిల్లా కోర్టు సముదాయంలోని సమస్యల ను, డిమాండ్లను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

జిల్లా పోర్టు పోలియో జడ్జి, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి జిస్టిస్ జె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. జూనియర్ న్యాయవాదులకు వర్క్‌షాపులను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జిమెంట్ల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. హైకోర్టు జడ్జి జస్టిస్ నామవరపు రాజేశ్వర్ రావు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఐదుకోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, హనుమకొండ, వరంగల్ జిల్లాల వ్యాప్తంగా కూడా 30వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు చిత్తశుద్ధితో కేసుల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. వరంగల్ జిల్లాతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. హైకోర్టు మరో జడ్జి జస్టిస్ టి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. కోర్టు సముదాయంలో కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఈ-సేవా కేంద్రం ద్వా రా న్యాయవాదులు తమ కేసుల దస్తావేజులను ఉచితంగా స్కాన్ చేసుకోవచ్చునని తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రధాన న్యాయమూర్తి

తొలుత హనుమకొండ జిల్లా ప్రధాన జడ్జి ఎం.క్రిష్ణమూర్తి స్వాగతోపన్యాసం చేశారు. వరంగల్, హనుమకొండ కోర్టు సముదాయం ప్రాముఖ్యత, ఓరుగల్లు జిల్లా చారిత్రక నేపథ్యాన్ని వివరించారు. వరంగల్ జిల్లా జడ్జి కోక రాధాదేవి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. తొలుత జస్టిస్ అరాథే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ల అధ్యక్షులు వై.శ్యాంసుందర్ రెడ్డి, ఈ.ఆనంద్ మోహన్, రాష్ట్ర బార్‌కౌన్సిల్ సభ్యులు భైరపాక జయాకర్, దుస్సా జనార్దన్, హైకోర్టు రిజిస్ట్రార్ నందికొండ నర్సింగరావు, ఉభయ జిల్లాల అదనపు జిల్లా జడ్జిలు, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆహూతులతో కోర్టు ప్రాంగణం కిటకిటలాడింది. కార్యక్రమం ఆద్యంతం అహ్లాదకర వాతావరణంలో జరిగింది.

అంతకుముందు పది కోర్టుల భవన సముదాయం ముందుగల కాకతీయ కళాతోరణం ఎదుట జిల్లా న్యాయమూర్తులు, అదనపు న్యాయమూర్తులు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధేతో కలిసి గ్రూప్ ఫొటోలు దిగారు. సమావేశం అనంతరం బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ముఖ్య అతిథులను సత్కరించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరాధే శనివారం రాత్రి ఇక్కడే బస చేస్తారు. ఆదివారం హనుమకొండలోని వేయి స్తంభాలగుడి, భద్రకాళి దేవాలయం, ములుగులోని రామప్ప గుడిని సందర్శిస్తారు. కాగా, ఆదివారం నర్సంపేటలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును జిల్లా పోర్టు పోలియో జడ్జి జిస్టస్ కె.లక్ష్మణ్ ప్రారంభిస్తారు.

లోక్ అదాలత్‌లో 8,214 కేసుల పరిష్కారం

హనుమకొండ జిల్లాలో 3,501, వరంగల్ జిల్లాలో 4,713

వరంగల్ లీగల్, మార్చి 16 : జాతీయ రాష్ట్ర న్యాయ సేవా సంస్థల ఆదేశాల మేరకు శనివారం జిల్లా కోర్టు సముదాయంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 8,214 కేసులను పరిష్కరించినట్టు వరంగల్, హనుమకొండ జిల్లా జడ్జిలు కె.రాధాదేవి, ఎం.క్రిష్ణమూర్తి తెలిపారు. వరంగల్ జిల్లాలో తొమ్మిది బెంచీలు ఏర్పాటుచేసి 49 సివిల్ కేసులు, 28 రోడ్డు ప్రమాద బీమా కేసులు పరిష్కరించి బాధితులకు రూ.కోటి 40లక్షల 92వేల 176 నష్టపరిహారం చెల్లించారు. 4,164 క్రిమినల్ కేసులు, 5 ప్రీలిటిగేషన్ కేసులు, 13 బీఎస్ఎన్ఎల్ కేసులు పరిష్కరించినట్టు తెలిపారు. హనుమకొండ జిల్లా పరిధిలో 39 సివిల్ కేసులు, 24 మోటారు ప్రమాద బీమా కేసులు పరిష్కరించి బాధితులకు రూ.1,13,75,000 నష్టపరిహారం అందించినట్టు న్యాయమూర్తులు తెలిపారు. 3455 క్రిమినల్ కేసులు, 7 బీఎస్ఎన్ఎల్ కేసులు కూడా పరిష్కరించారు.

అంతకుముందు ఉదయం 10.30 గంటలకు న్యాయసేవా సంస్థ భవన్‌లో లోక్ అదాలత్ కార్యక్రమాన్ని హనుమకొండ, వరంగల్ జిల్లా జడ్జిలు ప్రారంభించారు. హనుమకొండ జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి ఉపేందర్ రావు, వరంగల్ జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి సాయికుమార్, హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్, అదనపు జిల్లా జడ్జిలు, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ల అధ్యక్షులు ఎలుకుర్తి ఆనంద్ మోహన్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, న్యాయవాదులు, వివిధ బ్యాంకు ఇన్సూరెన్స్ అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.



లోక్‌అదాలత్‌ను ప్రారంభిస్తున్న వరంగల్ జిల్లా జడ్జి రాధాదేవి

'మానుకోట'లో పొలిటికల్ హీట్

(5వ పేజీ తరువాయి)

ములుగు మొదలుకుని నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు, పినపాక, భద్రాచలం వరకు మొత్తం ఏడు ఏజెన్సీ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉంది. అయితే ప్రచార వ్యవధికాలానికి ఒకట్రెండురోజుల ముందే ఆయా నియోజకవర్గాలను చుట్టిరావడంతో పాటు అన్ని వర్గాల ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేసేందుకు నేతలు సమాయత్తమవుతున్నారు. తమ పార్టీల అగ్రనేతల సభలు, రోడ్‌షోల నిర్వహణకు కసరత్తు చేసుకుంటున్నారు. ముందస్తుగానే అసెంబ్లీ నియోజవర్గాల వారీగా పార్లమెంటరీ ఎన్నికల సన్నాహక సమావేశాలను నిర్వహిస్తున్నారు. తొలుత పార్టీ టికెట్ ఖరారు చేసుకున్న సిట్టింగ్ బీఆర్ఎస్ ఎంపీ మాలోతు కవిత తన తండ్రి, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ సొంత నియోజకవర్గంలోని మరిపెడ నుంచి ప్రచారం ఆరంభించారు. కాంగ్రెస్ రెండవ జాబితాలో చోటు దక్కించుకున్న కేంద్రమాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ రెండ్రోజుల కిందట మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధి భద్రాచలంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమానికి హాజరై తన ప్రచార పర్వానికి అక్కడి నుంచే శ్రీకారం చుట్టారు. తాజాగా బీజేపీ అభ్యర్థి, మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్ నర్సంపేట నియోజకవర్గం నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టి గూడూరు మీదుగా డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాల్లో శనివారం పర్యటించారు. అయితే ఈ ముగ్గురు పార్లమెంట్ నియోజకవర్గానికి పాత ముఖాలే కావడంతో తమతమ హయాంలో చేసిన అభివృద్ధిని చెప్పుకోవడంతో పాటు పరిచయాలతో ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

కోడ్‌తో సామాన్యులకు సంకటమే..

సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతోనే ఎన్నికల కోడ్ శనివారం నుంచే అమల్లోకి రావడం, సుమారు రెండునెలల పాటు ఈ కోడ్ అమల్లో ఉండనుండటంతో సామాన్యులకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలున్నాయి. ఎవరైనా రూ.50వేల కంటే ఎక్కువ నగదుతో వెళ్లాల్సి వస్తే వాటికి సంబంధించిన సరైన ఆధారాలు చూపాలి. లేదంటే అధికారులు ఆ నగదును సీజ్ చేస్తారు. అయితే ప్రస్తుతం వివాహ శుభకార్యాల సమయం కావడం, ముఖ్యంగా ఏప్రిల్ 26 వరకు ఎక్కువ ముహూర్తాలు ఉండడంతో పెళ్లిళ్లు, ఇతరత్రా శుభకార్యాలకు అవసరమైన బంగారం, దుస్తులు, ఇతర వస్తువులు ఖరీదు చేసేందుకు వధూవరుల బంధువర్గాలు ఇతర ప్రాంతాలకు వెళుతుంటారు. ఈ క్రమంలో అధిక మొత్తంలో నగదును తీసుకువెళ్లాల్సి ఉంటుంది. నగదు తీసుకువెళ్లకుండా ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేసే అవకాశాలున్నప్పటికీ ఆన్‌లైన్ విధానంలో చెల్లించే వాటి దుకాణాల వారు ట్రాన్సాక్షన్ చార్జీల పేరుతో వసూలు చేస్తుండటంతో చాలా మంది డబ్బు రూపంలోనే ఇచ్చేందుకు ఆసక్తి చూపుతుంటారు. అలాగే ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన వారికి డిజిటల్ చెల్లింపులపై అంతగా అవగాహన లేని వారు డబ్బును తీసుకెళుతుంటారు. అలాంటి వారికి ఎన్నికల కోడ్ తనిఖీలు కొంత సంకటంగా మారే అవకాశాలున్నాయి.

అధునాతన పద్ధతిలో

గర్భస్థ శిశువు తొలగింపు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, మార్చి 16 : ఓ తల్లి గర్భంలో ముగ్గురు శిశువులు ఒకే అమ్నిమాటిక్ పొరతో కప్పబడి ఉండగా అత్యంత అధునాతన పద్ధతిలో ఒక శిశువును తొలగించినట్లు హనుమకొండలోని ఫీటల్ మెడిసిన్ సెంటర్ వైద్యురాలు డాక్టర్ శిరీష శనివారం తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష మాట్లాడుతూ.. వరంగల్‌లో మొట్టమొదటి సారిగా ఈవిధానంలో చికిత్స అందించామన్నారు. వరంగల్ శివనగర్ ప్రాంతానికి చెందిన 15 వారాల గర్భిణి గుగులోతు సంతోష (29) చికిత్స నిమిత్తం తమ వద్దకు వచ్చినట్లు తెలిపారు. ఈమె గర్భంలో ఒకే పొర కింద ముగ్గురు శిశువులున్నట్లు గుర్తించి పొటాషియం క్లోరైడ్ ఇంజనక్షన్‌తో ఒక శిశువును తొలగించే అవకాశం ఉన్నప్పటికీ అది సాధ్యం కాలేదన్నారు. కొన్ని ఇంజక్షన్లు ఇవ్వడం వల్ల ముగ్గురు శిశువులు చనిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ కష్టమైన కేసులో ముంబై నుంచి ఓ ప్రత్యేకమైన లేజర్ మిషన్ తెప్పించి క్లిష్టమైన అరుదైన శస్త్రచికిత్సను హనుమకొండలో నిర్వహించామన్నారు. హైదరాబాద్ నగరంలో ఇలాంటి కేసులు ఒకటి రెండు మాత్రమే జరిగాయని తెలిపారు. హైదరాబాద్ నగరంలో 75వేల నుంచి రూ.90వేల వరకు ఖర్చు కానుండగా, హనుమకొండలో మాత్రం రూ.35వేలకే చికిత్స అందించామని తెలిపారు. ప్రస్తుతం గర్భిణితో పాటు ఇద్దరు శిశువులు క్షేమంగా ఉన్నట్లు ఫీటల్ మెడిసిన్ వైద్యురాలు డాక్టర్ శిరీష వెల్లడించారు.

అడవులను కాపాడుకుందాం

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

తాడ్వాయి, మార్చి 16: అడవులను కాపాడుకోవాలని, అది మనందరి బాధ్యత అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండల కేంద్రంలో గొత్తికోయలతో శనివారం జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. 30ఏళ్ల నుంచి అడవిలో నివసిస్తున్న గొత్తికోయలకు విద్య, వైద్యం, విద్యుత్, తాగునీరు, రేషన్‌కార్డులు, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు తదితర సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. ప్రస్తుతం ఉన్న స్థలంలో ఉండాలని, కొత్తగా అడవుల్లో చెట్లను నరకొద్దని, కొత్తవారికి ఆశ్రయం కల్పించొద్దని అన్నారు. అనంతరం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమకూర్చిన సోలార్ విద్యుద్దీపాల ను గొత్తికోయ కుటుంబాలకు అందజేశారు. అదేవిధంగా కాటాపూర్, తాడ్వాయి, బందాల, నర్సాపూర్, లింగాల, బీరెల్లి, తదితర గ్రామాల్లోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఎస్పీ శబరీశ్ మాట్లాడుతూ గొత్తికోయగూడాల్లోకి అపరిచితులను రానీయొద్దని, అను మానితులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీజ, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రా మిశ్రా, ఏఎస్పీ గీతే మహేష్ బాబాసాహెబ్, ములుగు డీఎస్పీ రవీందర్, డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్, తహసీల్దార్ రవీందర్, పస్రా సీఐ శంకర్‌తోపాటు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



తాడ్వాయిలో గొత్తికోయ మహిళలకు సోలార్ లాంప్‌లను అందజేస్తున్న మంత్రి సీతక్క

ప్రజా సంక్షేమమే ధ్యేయం

గోవిందరావుపేట: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండలంలోని మచ్చాపూర్, చల్వాయి, గోవిందరావుపేట, పస్రా తదితర గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆమె పర్యటించారు. మచ్చాపూర్‌లో సీసీరోడ్డు నిర్మాణం, చల్వాయిలో పాఠశాల ప్రహరీగోడ నిర్మాణం, గోసంగి సంఘం కమ్యూనిటీహాల్, గోవిందరావుపేటలో పద్మశాలి కమ్యూనిటీహాల్ నిర్మాణం, పస్రాలో సీసీరోడ్డు, దేవాలయ ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఏటూరునాగారం రూరల్ : పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క మండలంలో పర్యటించారు. గత ఏడాది జంపన్నవాగు ఉధృతికి దొడ్ల- మల్యాల మధ్య బ్రిడ్జి కొట్టుకుపోగా ఆయా గ్రామాల ప్రజలకు రవాణా ఇబ్బందులు కలగకుండా ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా రూ. 9.50 కోట్లతో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి గడువులోగా పూర్తి చేసి గిరిజన గ్రామాలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశాలిచ్చారు. అదేవిధంగా మండలంలోని చిన్నబోయినపల్లి వద్ద మసీదు వద్ద రూ. 5లక్షలతో ప్రహరీ నిర్మాణ పనులను మంత్రి ప్రారంభించారు. అదే గ్రామంలో దాత దోమాటి సతీష్ ఆర్థిక సహకారంతో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్నీ మంత్రి ప్రారంభించారు. గ్రంథాలయ ఏర్పాటుకు సహకరించిన దాతను మంత్రి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ ప్రమోద్, డీఈ రఘువీర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మసీదు నిర్మాణ పనులు ప్రారంభం

వెంకటాపూర్(రామప్ప): మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామంలో రూ.15లక్షలతో చేపడుతున్న మసీదు, మదర్సా నిర్మాణాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. గతంలో లక్ష్మీదేవిపేటతోపాటు సీతారాంపూర్, నల్లగుంట, బూర్గుపేట గ్రామాలకు చెందిన ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు వెంకటాపూర్, పాలంపేటలోని మసీదులకు వెళ్లాల్సి వచ్చేదని అన్నారు. ఈక్రమంలో గ్రామానికి చెందిన ముస్లిం పెద్ద మహ్మద్ సర్వర్ అహ్మద్ మసీదు నిర్మాణం కోసం సంకల్పించారని అన్నారు. గ్రామానికి చెందిన తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తన తల్లిదండ్రుల స్మారకార్థం మసీదు, ఖబరస్థాన్‌కు 20గుంటల భూమి దానం చేశారని, దీనికితోడు సర్వర్‌అహ్మద్ రూ.12లక్షలతో మసీదు, మదర్సా మరుగుదొడ్లు, వజూ ఖానా నిర్మాణ పనులు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు ముహమ్మద్ సాదిక్, సయ్యద్ ఖాసిం, మగ్బూల్‌పాషా, పఠాన్‌ఖాన్, హుస్సేన్, నూరిష్, సర్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా భాగస్వామ్యంతోనే దేశాభివృద్ధి

ప్రొఫెసర్ రమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రమాదేవి

భూపాలపల్లిటౌన్, మార్చి 16: మహిళా భాగస్వామ్యంతోనే దేశాభివృద్ధి సాధ్యమని నిట్ ప్రొఫెసర్ రమాదేవి అన్నారు. భూపాల పల్లి పట్టణంలో టీఎస్‌యూ టీఎఫ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ రమాదేవి మాట్లాడుతూ మహిళా భాగస్వామ్యం, శ్రమ లేకుండా సమాజం లేదని అన్నారు. అందొచ్చిన అవ కాశాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలు రమ, అధ్యక్షుడు నక్క తిరుపతి, ప్రధాన కార్యదర్శి రమేష్, రామయ్య, కుమారస్వామి, వీరన్న, శ్రీధర్, సురేందర్, రవి, సదాశివుడు, రాణి, సంపత్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి : డీఈవో

తాడ్వాయి, మార్చి 16: పదోతరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) పాణిని సూచించారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా పదోతరగతిని సందర్శించి విద్యార్థినులనుద్దేశించి మాట్లాడారు. ఈనెల 18 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు జరుగనున్నాయని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణ చదువుకుని మంచి మా ర్కులు సాధించాలని, దీంతో పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని అన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కాటారం, మార్చి 16: మండలంలోని విలాసాగర్ మానేరు నది నుంచి ఇసుకను అక్రమంగా మండల కేంద్రానికి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శుక్రవారం అర్ధరాత్రి పోలీసులు పట్టుకున్నారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన కుంభం మహేష్, ధర్మసాగర్ గ్రామానికి చెందిన పెనుగొండ మహేష్ ట్రాక్టర్లతో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై మ్యాక అభినవ్ శనివారం తెలిపారు.

ముగిసిన షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ



బహుమతులు అందిస్తున్న ఎంపీపీ, ఎస్సై

కాటారం, మార్చి 16: మండలకేంద్రంలో డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన భగత్‌సింగ్ స్మారక బ్యాడ్మింటన్ టోర్నీ ముగిసింది. ఇన్విటేషన్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీలో పలువురు క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చాటారు. శనివారం బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. ముగింపు సభకు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందు సాయిలు, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎస్సై మ్యాక అభినవ్ ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందించారు. ప్రథమ బహుమతి కడారి శేఖర్, ప్రవీణ్, రెండో బహుమతి ఉదయ్, నందు, తృతీయ బహుమతి సందీప్, తరుణ్ సాధించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా ప్రధానకార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్, ఎస్ ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు బొడ్డు కిశోర్, మండల అధ్యక్షుడు కనుకుల పవన్ తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

వెంకటాపురం(నూగూరు), మార్చి 16: బడీడు పిల్లలను తప్పకుండా పాఠశాలల్లో చేర్పించాలని ఎస్సై అశోక్ అన్నారు. శనివారం మండలపరిధిలోని యాకన్నగూడెంలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం జరగగా ఆయన గ్రామస్థులను సమావేశపరిచి మాట్లాడారు. మద్యం, గంజాయి సేవించడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. గ్రామంలో ఏమైనా సమస్యలు నెలకొన్నట్లయితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేవిధంగా కృషిచేస్తానని అన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పోలీసులు సహాయ సహకారాలు అందిస్తారని పేర్కొన్నారు. గ్రామంలోకి గుర్తుతెలియని వ్యక్తులు వచ్చినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం మద్యపాన నిషేధానికి ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలల పరిరక్షణ కమిటీలను బలోపేతం చేయాలి

తాడ్వాయి, మార్చి 16: గ్రామ బాలల పరిరక్షణ కమిటీలను బలోపేతం చేయాలని ఐసీడీఎస్ సీడీపీవో మల్లీశ్వరి అన్నారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లతో శనివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు బాలికల అభివృద్ధికి విఘాతం కలిగిస్తున్నాయన్నారు. బాలికల చదువుతో వారి భవిష్యత్తు బంగారుమయం అవుతుందని అన్నారు. బాల్య వివాహానికి గురైన బాలికలు శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యపరంగా, సామాజికంగా ఎదుగుదల విషయంలో ఎన్నో ఇబ్బందులు పడుతుండడం బాధాకరమని అన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరిగితే సహించేదిలేదని, అందుకు కారణమైన తల్లిదండ్రులు, పెళ్లికొడుకు, సహకరించిన వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయ, అనంతలక్ష్మి, కళావతి, శారద, శ్రావణి, శిరీష, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

మల్హర్, మార్చి 16: మండల కేంద్రమైన తాడిచర్లలో శనివారం ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఫ్లెక్సీకి బూడిద దుర్గా వెంకట మెమోరియల్ సంస్థ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం 16 కార్పొరేషన్ల ఏర్పాటుకు కృషి చేసిన సందర్భంగా శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందారపు వంశీకృష్ణ, కుంట సదానందం, ఆకుల శ్రీనివాస్, పైడాకుల సమ్మయ్య, ఆర్నీ రాజబాపు, రావుల ఆంజేయులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

ములుగు కలెక్టరేట్/భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 16: పార్లమెంట్ ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి ఆయన శనివారం రాత్రి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ములుగు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఇలా త్రిపాఠి, భూపాలపల్లి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ భవేష్ మిశ్రా హాజరయ్యారు. ఈసందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ దేశంలో ఏడు దశల్లో పార్లమెంట్ సాధారణ ఎన్నికలు జరుగుతాయన్నారు. తెలంగాణలో పోలింగ్ నాలుగో దశ జరుగుతుందని తెలిపారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో కోడ్ అమలులోకి వచ్చిందని, 24గంటల వ్యవధిలో ప్రతి ప్రభుత్వ భవనాల్లో వివిధ రాజకీయపార్టీలకు, నాయకులకు సంబంధించిన హోర్డింగులు, నాయకుల ఫొటోలు, వాల్‌రైటింగ్స్‌ను తొలగించాలని అన్నారు. 48గంటల వ్యవధిలో పబ్లిక్ ప్రాపర్టీస్ వద్ద హోర్డింగులు, ఫ్లెక్సీలు, ఫొటోలను తొలగించాలన్నారు. ప్రైవేట్ స్థలాల్లో ఉన్న హోర్డింగులు, ఫ్లెక్సీలు, ఫొటోలను 72గంటల్లో తొలగించాలని, ఫిర్యాదుల పరిష్కారం కోసం జిల్లాలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రాజకీయ పార్టీలు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలకు ర్యాలీలు, సభల నిర్వహణకు అనుమతులను నిబంధనల ప్రకారం జారీ చేయాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ తప్పకుండా పోస్టల్ బ్యాలెట్ అందేలా వారి సమాచారాన్ని ముందస్తుగా సేకరించాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం, ఇతర ప్రలోభాలకు ఓటర్లు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, జిల్లాలో అవసరమైన మేర చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదు ఎవరూ తీసుకెళ్లొద్దని అన్నారు. నగదు జప్తు చేసే సమయంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని సూచించారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సంబంధించిన ప్రకటనలకు అనుమతిని ఇచ్చేలా ఎంసీఎంసీ పనిచేయాలని, శాంతిభద్రతలు కట్టుదిట్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికలకు సంబంధించి రిపోర్టులు ప్రతిరోజూ సమర్పించే విధంగా జిల్లాలో వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల యంత్రాంగంపై అపోహలు సృష్టించేలా వచ్చే ఫేక్ న్యూస్‌లను ఎప్పటికప్పుడు ఫాలోఅప్‌చేసి ఖండించాలన్నారు. అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, ఎస్పీ శబరీశ్, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, మహేందర్‌జీ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఎన్నికల డీటీలు పాల్గొన్నారు. భూపాలపల్లి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు

(5వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాలను పాటించకుండా ఈడీ అధికారులు ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడం దారుణమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు బీజేపీ నాయకులు కుట్ర పన్నారని విమర్శించారు. పీఏసీఎస్ చైర్మన్ క్రాంతికుమార్‌రెడ్డి, జూకల్లు ఎంపీటీసీ తిరుపతి, పార్టీ టౌన్ అధ్యక్షుడు బుర్ర శ్రీధర్, యూత్ మండల అధ్యక్షుడు తౌటం నవీన్, దొడ్డె శంకర్, గుర్రపు తిరుపతి, శ్రీదేవి, కట్కూరి రాజేందర్. రాజేందర్, రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

- రేగొండ: కవిత అరెస్టుకు నిరసనగా మండల కేంద్రంలోని భూపాలపల్లి- పరకాల రహదారిపై బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్ నేతృత్వంలో రాస్తారోకో నిర్వహించారు. నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులను ఎస్సై రవికుమార్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాపిరెడ్డి, బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు కొలెపాక భిక్షపతి, రైతు విభాగం మండల అధ్యక్షుడు ఏనుగు లింగారెడ్డి, నాయకులు మాదాడి కర్ణాకర్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ రియాజ్ పాషా పాల్గొన్నారు.

ములుగులో రాస్తారోకో

ములుగు, మార్చి 16: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టుకు నిరసనగా బీఆర్ఎస్ ములుగు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం జిల్లాకేంద్రంలో రాస్తారోకో చేశారు. ఏరియా ఆస్పత్రి ఎదుట జాతీయ రహదారిపై కొద్దిసేపు నిరసన తెలిపారు. పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్ మాట్లాడుతూ కవిత అరెస్టు అప్రజాస్వామికమని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గొర్రె సమ్మయ్య, నాయకులు చంద్రమౌళి, గండి కుమార్, శ్రీనివాస్, మహేందర్, అనుముల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్పందించని పార్టీ నేతలు

కవిత అరెస్టుకు నిరసనగా పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేయాలని బీఆర్ఎస్ అధిష్ఠానం ఇచ్చిన పిలుపునకు ములుగు జిల్లా శ్రేణులు స్పందించలేదు. జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్‌పర్సన్ సహా ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులెవరూ కూడా నిరసన కార్యక్రమాల్లో పాల్గొనలేదు. మండల అధ్యక్షులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పార్టీ పిలుపును ఏమాత్రం పట్టించుకోకపోగా వివాహ, శుభకార్యాలకు హాజరైనట్లు ఫొటోలు, సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. జిల్లాకేంద్రంలో జరిగిన రాస్తారోకోలో పది మంది లోపే నాయకులు పాల్గొనగా పది నిమిషాలు కూడా నిరసన తెలపలేదు. ఇదిలా ఉంటే భారత జాగృతి

దురాశలే నేరాలకు మూల కారణం

భూపాలపల్లి సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి



కక్షిదారులకు రాజీ పత్రాలను అందిస్తున్న సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జయరాంరెడ్డి

కృష్ణకాలనీ (భూపాలపల్లి), మార్చి 16: క్షణికావేశం, దురాశలే నేరాలకు మూల కారణమని భూపాలపల్లి సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ శనివారం జరిగింది. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చాలా మంది ప్రజలు అనవసరంగా కేసుల్లో చిక్కుకొని ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి వారి కోసం ఉచితంగా సత్వర న్యాయం అందించడం కోసం లోక్ అదాలత్ ఎంతో దోహదపడుతుందన్నారు. కక్షిదారులంతా రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడి రామచంద్రరావు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆనందరావుతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

కక్షిదారులు ప్రశాంత జీవనాన్ని గడపాలి

ములుగు జిల్లా జడ్జి లలిత శివజ్యోతి



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా జడ్జి లలిత శివజ్యోతి

ములుగు కలెక్టరేట్, మార్చి 16: జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు కేసులను రాజీ కుదుర్చుకొని ప్రశాంత జీవనాన్ని గడపాలని జిల్లా జడ్జి లలిత శివజ్యోతి అన్నారు. ములుగులోని జిల్లా కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ జరగగా 200 పెండింగ్ కేసులను ఆమె పరిష్కరించారు. ఈసంద ర్భంగా మాట్లాడుతూ రాజీ మార్గమే రాజ మార్గమన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు తమ కేసులను రాజీ చేసుకుంటే అప్పీల్ ఉండదని, ఇదే అంతిమ తీర్పు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి టి.మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రామ్మోహన్‌రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ ఎ.రాములు, తహసీల్దార్ విజయ్‌భాస్కర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పావని, న్యాయవాదుల సంఘం జనరల్ సెక్రటరీ మేకల మహేందర్, న్యాయవాదులు నర్సిరెడ్డి, ఎం.వినయ్‌కుమార్, ఆర్.భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

బెగ్లూర్‌లో కార్డన్‌సెర్చ్

మహదేవపూర్ రూరల్, మార్చి 16: మండల పరిధిలోని బెగ్లూర్‌లో మహదేవపూర్ సీఐ రాజేశ్వరరావు శనివారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఎస్సై ప్రసాద్‌తో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పలువురి ఇళ్లల్లో గుడుంబాను గుర్తించి సీజ్ చేశారు. అనంతరం గ్రామస్థులతో సమావేశమయ్యారు. రానున్న ఎంపీ ఎన్నికల నేపథ్యంలో కోడ్‌ను ఉల్లంఘించేలా ఏదైనా కార్యక్రమం చేసినట్లు తమ దృష్టికి వస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలన్నారు. లైసెన్సు, వాహన పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. గుడుంబాను విక్రయిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. యువత చదువులో ముందుండి ఉన్నతంగా ఎదగాలని సూచించారు. గ్రామంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయన్నారు. ఈకార్యక్రమంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

చిట్యాల, మార్చి 16: పదో తరగతి వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి కోడెపాక రఘుపతి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని రెండు పరీక్ష కేంద్రాలను సందర్శించారు. పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, ఫ్యాన్లు, విద్యుద్దీపాలు, తాగు నీటి సౌకర్యాలను పరిశీలించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రంలో 158 మంది, గురుకుల పాఠశాల కేంద్రంలో 180 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు ఎంఈవో రఘుపతి తెలిపారు. ఆయన వెంట పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు గోల్కొండ భిక్షపతి, ఎం.డి.సాదిక్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు కె.ప్రసాద్, ఆర్.భిక్షపతి ఉన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

మల్హర్, మార్చి 16: మండల కేంద్రమైన తాడిచర్ల, పెద్దతూండ్ల, అడ్వాలపల్లిలో అభివృద్ధి పనులను ఎంపీపీ చింతలపల్లి మల్హర్‌రావు, రుద్రారంలో అభివృద్ధి పనులను వైస్ ఎంపీపీ బడితల స్వరూప శనివారం ప్రారంభించారు. తాడిచర్లలో రూ. 1.5 లక్షలతో వెంకటేశ్వరాలయం, రూ.1.75 లక్షలతో తహసీల్దార్ కార్యాలయంలో బోరు, ఎస్సీకాలనీలో రూ. 5 లక్షలతో పైప్ లైన్, పెద్దతూండ్లలో రూ. 20 లక్షలతో మెటల్ రోడ్డు, రూ. 60 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఎంపీపీ మల్హర్‌రావు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. రుద్రారంలో రెండు బోర్ల పనులను వైస్ ఎంపీపీ బడితల స్వరూప స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఎంపీడీవో శ్యామ్‌సుందర్, మాజీ ఉప సర్పంచ్ ఇందారపు చంద్రయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కోడలు ఇంట్లోంచి గెంటేసింది..

ఓ వృద్ధ దంపతుల ఆవేదన

కృష్ణకాలనీ (భూపాలపల్లి), మార్చి 16: ఇంట్లో నుంచి తమ కోడలు బలవంతంగా వెళ్లగొట్టిందని ఓ వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. భూపాలపల్లి పట్టణంలోని మంజూర్‌నగర్‌లోని బీసీకాలనీకి చెందిన పెండ్యాల రాజన్న, శ్రీదేవి శనివారం విలేకరుల ఎదుట కంటతడి పెట్టారు. వెలిబుచ్చారు. తమ పెద్ద కుమారుడు పెండ్యాల నరేన్ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తూ ఏటూరునాగారంలోనే ఉంటున్నాడని తెలిపారు. అతడికి 2020లో వివాహం కాగా ఒక కుమారుడు జన్మించాడని చెప్పారు. కుటుంబ కలహాల కారణంగా రెండేళ్లుగా కొడుకు, కోడలు వేర్వేరుగా ఉంటున్నారని, ఈ క్రమంలో జిల్లా కోర్టులో పిటిషన్ వేయగా విడాకుల మంజూరుకు నోటీసు జారీ అయ్యిందని తెలిపారు. ఈ క్రమంలో 20 రోజుల క్రితం తాము నివాసముండే బీసీకాలనీలోని ఇంటికి వచ్చి వచ్చి నానా హంగామా చేసిందని, బలవంతంగా తమను ఇంట్లో నుంచి గెంటేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అప్పటి నుంచి తాము ఆలయంలో తలదాచుకుంటున్నామని కంటతడి పెట్టారు. కూలినాలీ చేసుకొని జీవించే తాము వృద్ధాప్యంలో ఇలా నిరాశ్రయుల య్యామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తమకు న్యాయం చేసి ఇంట్లోకి వెళ్లేలా చూడాలని వేడుకున్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న వృద్ధ దంపతులు

గుండెపోటుతో యువకుడి హఠాన్మరణం

నిద్రలోనే తుదిశ్వాస విడిచిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి



గట్టు రాజు (ఫైల్)

గణపురం, మార్చి 16: నెట్‌విట్ ఆలిండియా ఫిజిక్స్ పరీక్షలో అతడు అత్యంత ప్రతిభ చాటాడు. ఎన్‌ఐటీలో పీజీ పూర్తి చేసిన అతడి టాలెంట్‌ను గుర్తించి ఇస్రో సంస్థ జూనియర్ సైంటిస్ట్‌గా అవకాశం కల్పించింది. ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేస్తున్న అతడు గుండెపోటుతో మృతి చెందాడు. నిశ్చితార్థానికి సిద్ధమై మరిరోజుల్లో పెళ్లి జరగనుండగా హఠాన్మరణం చెందాడు. మండలంలోని బస్వరాజుపల్లిలో చోటుచేసుకున్న ఈ సంఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది.

గణపురం మండలం బస్వరాజుపల్లిలోని గట్టు సదయ్య, భారత దంపతులకు రెండో సంతానం గట్టు రాజు (31) చిన్నప్పటి నుంచే చదువులో దిట్ట. 2014లో డిగ్రీ పూర్తి చేసి అనంతరం నెట్‌విట్ ఆలిండియా ఫిజిక్స్ విభాగంలో పోటీ పరీక్ష రాసి జాతీయ స్థాయిలో 14వ ర్యాంకు సాధించాడు. వరంగల్ ఎన్‌ఐటీలో పీజీ పూర్తి చేశాడు. 2017లో ఇస్రో సంస్థ నిర్వహించిన జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్‌లో జూనియర్ సైంటిస్ట్‌గా ఎంపికయ్యాడు. ఆరె నెలల తర్వాత దానిని రాజీనామా చేసి ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. రెండేళ్లుగా వర్క్‌ఫ్రం హోమ్ చేస్తున్న రాజుకు శుక్రవారం అర్ధరాత్రి ఛాతీ నొప్పి వచ్చింది. దీంతో తల్లిదండ్రులు గృహం వైద్యం చేసి నిద్రపుచ్చారు. శనివారం తెల్లవారుజామున తల్లిదండ్రులు అతడిని నిద్రలేపడానికి ప్రయత్నించగా ఎలాంటి కదలికలు లేకపోవడంతో దగ్గరలోని ఆర్‌ఎంపీని పిలిచి చూపించగా అప్పటికే రాజు మృతి చెంది ఉన్నాడు. తన కొడుకు ఇక లేడని తెలుసుకున్న తల్లిదండ్రులు గుండెలు బాదుకున్నారు. కొడుకు ప్రాయోజకుడయ్యాడని పెళ్లి సంబంధాలు చూసి నిశ్చితార్థానికి సిద్ధమయ్యామని, మరికొన్ని రోజుల్లో వివాహం జరగాల్సి ఉండగా ఇంతలోనే అనంతలోకాలకు చేరుకున్నాడని కన్నీటి పర్యంతమయ్యారు.

• 'దిక్కు'తోచని స్థితి

రోడ్డు పక్కన అధికారులు ఏర్పాటు చేసిన సూచికలు విస్మయం కలిగిస్తున్నాయి. ఏ ఊరు ఎన్ని కిలో మీటర్ల దూరంలో ఉందో తెలిపే సైన్‌బోర్డుల వివరాలతో గందరగోళం కలిగిస్తున్నాయి. భూపాలపల్లి మండలం కమలాపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఆర్‌అండ్‌బీ, అటవీ శాఖ, నేషనల్ హైవే శాఖలు ఏర్పాటు చేసిన బోర్డుల్లో కిలోమీటర్ల అంకెలు వేర్వేరుగా దర్శనమిస్తున్నాయి. కమలాపూర్ క్రాస్ రోడ్డు నుంచి భూపాలపల్లి పట్టణానికి దూరాన్ని ఆర్‌అండ్‌బీ 5 కిలోమీటర్లు, నేషనల్ హైవే అధికారులు 7 కిలోమీటర్లు అని పేర్కొంది. అటవీ శాఖ మాత్రం 4 కిలోమీటర్లు దూరం ఉన్నట్లు ఉన్నట్టు తెలిపింది. ఒకేచోటా బోర్డులు ఉన్నప్పటికీ అందులో వేర్వేరు వివరాల ఉంటడంపై వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. ఇందులో ఏది నిజమైందో తెలియక తికమక పడుతున్నారు.

- భూపాలపల్లి టౌన్



మద్యం మత్తులో ఆత్మహత్య



మహేశ్ (ఫైల్)

మహదేవపూర్, మార్చి 16: మద్యం మత్తులో ఎలుకల మందు ఓ వ్యక్తి తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మహదేవపూర్ ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన నగునూరి మహేశ్ (50) శుక్రవారం రాత్రి మద్యం మత్తులో ఇంటిలోని ఎలుకల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో భూపాలపల్లి 100 పడకల ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మహేశ్ మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న ప్రభుత్వాలు : బీఆర్ఎస్

కాటారం, మార్చి 16: అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖూనీ చేస్తున్నాయని బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షురాలు, మండల ఇన్‌చార్జి అధ్యక్షురాలు రత్న సౌజన్యరెడ్డి విమర్శించారు. మండలకేంద్రంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్వకుంట్ల కుటుంబాన్ని ఇబ్బంది పెట్టి రాజకీయంగా అణగదొక్కడానికి కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. ఎమ్మెల్సీ కవితను ఎలాంటి ముందస్తు నోటీసులు లేకుండా తనిఖీల పేరిట అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా, ఎన్ని అక్రమ అరెస్టులు చేసినా బీఆర్ఎస్ నాయకులు భయపడే ప్రసక్తే లేదన్నారు. అక్రమ అరెస్టులు ఆపకపోతే ప్రజల చేతిలో బీజేపీ, కాంగ్రెస్‌లు దెబ్బతినక తప్పదని హెచ్చరించారు.